సాక్షి
శ్రీకాకుళం

బుధవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2024



జీ(వి)తం మెరుగైంది

అర్చకుల జీ(వి)తం మెరుగైంది. ఆలయాలకూ ధూపదీప నైవేద్యాలు సమకూరుతున్నాయి. - 8లో



వివాహిత హత్య

సారవకోట మండలం నౌతళ సమీపంలో వివాహిత హత్య జరిగింది. ఆమెది ఒడిశాలోని పాటికోట. - 8లో

శ్రీముఖలింగం హుండీ ఆదాయం లెక్కింపు రేపు



జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఈఓ ప్రభకరరావు మంగళవారం తెలిపారు. దేవదాయ శాఖ, ధర్మకర్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని, భక్తులు హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

23 రోజుల్లో రూ.59.10 లక్షల ఆదాయం



హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి హుండీల కానుకల ద్వారా రికార్డు స్థాయిలో రూ.59,10,775 వరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్ బాబు తెలియజేశారు. ఆలయ అనివెట్టి మండపంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ నెల 5 నుంచి 27వ తేదీ వరకు కేవలం 23 రోజుల్లో ఇంతటి ఆదాయం రావడం విశేషం. నగదు రూపంలో రూ.57,61,049, చిల్లర రూపంలో రూ.1,49,726 వరకు లభించగా, 31 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కూడా కానుకల రూపంలో లభించింది. స్థానిక జిల్లా దేవదాయ శాఖాధికారి బలివాడ ప్రసాద్‌పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు జలగడుగుల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ రక్షిత నీటి పథకం నిర్వహణ, జలజీవన్ మిషన్‌లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్‌ఈ, ఈఈలు, డీఈ, ఏఈలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. సంతబొమ్మాళి మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఎద్దడి ఉంటుందని చెప్పగా జలజీవన్ మిషన్ పనులు ఎంత వరకు వచ్చిందీ అడిగి తెలుసుకుని త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించి మండలాల్లో ఎంపీడీఓలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ల్యాబ్‌లో ఏయే పరీక్షలు చేస్తారని కలెక్టర్ డీఈని అడుగగా, నైట్రేట్, ఫ్లోరైడ్, తదితరమైనవి పరీక్షిస్తామని డీఈ చెప్పారు. తాగునీటిలో కాలుష్యం లేకుండా చూడాలని, మందసలో ఫ్లోరైడ్ వచ్చిందని, వెంటనే ఆ బోర్‌ని కండెం చేశామని సంబంధిత ఏఈ వివరించారు. ఆర్‌ఓ ప్లాంట్స్ ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కాలుష్యం ఉన్న ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తాగు నీరు అందించేందుకు పది రోజుల్లో గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లే అవుట్లు, ఇళ్లకు ఎన్ని కనెక్షన్లు ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి పట్టివేత



స్టేషన్ రోడ్డులో 15 కేజీల గంజాయితో పట్టుబడిన ఒడిశా వాసులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఉదయం గంజాయి తరలిస్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారి నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో ముగ్గురు యువకులను పోలీసులు నిలుపుదల చేయగా పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు రాయగడ నుంచి 15 కిలోల గంజాయిని తీసుకువస్తున్నారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ అటల శ్రీనివాసరావు, ట్రాఫిక్ పీసీ గోన కోదండరావు, పీసీ నీలకంఠం పాల్గొన్నారు. వాటిని డీటీ రవికుమార్ సమక్షంలో విలేకరుల ముందుంచారు. కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ -2024 పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మంగళవారం ప్రారంభమైంది. ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆన్‌లైన్ కేంద్రంలో మొదటి షిఫ్టులో 100కి 90, రెండో షిఫ్టులో 100కి 89 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో 100 కి 89, రెండో షిఫ్టులో 100 కి 89 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో 400 మందికి 357 మంది హాజరయ్యారు.

సరిహద్దులో ప్రగతి పొద్దు



గ్రామంలో నాడు నేడు ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాల

- ఒడిశా సరిహద్దు గ్రామం గొప్పిలిలో ప్రగతి జాడలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో మౌలిక సదుపాయాల కల్పన
- రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు



ఆ ఊరిలో దారులు ఏళ్లుగా బాగోలేవు. పద్నాలుగేళ్ల పాటు టీడీపీ నాయకులను గ్రామస్తులు బతిమలాడారు. కానీ ఎవరూ పని చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన కొన్నేళ్లలోనే ఆ ఊరు కొత్త దారులు చూసింది. అక్కడో వాటర్ ట్యాంక్ కూలిపోయే ప్రమాదంలో ఉన్నా దాని ద్వారానే ఏళ్ల తరబడి నీరందించారు. వినతులిస్తే బుట్టదాఖలు చేశారు. వైఎస్ జగన్ సర్కారు వచ్చాకే ఆ పల్లెకు కొత్త వాటర్ ట్యాంకు వచ్చింది. ఒకప్పుడు స్థానికులు ప్రతి పౌర సేవకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయంలో అవసరాలన్నీ తీరుతున్నాయి. అంతే కాదు.. దళిత వాడలో కమ్యూనిటీ హాల్, సరిహద్దులో వంతెన, రైతుల కోసం ఆర్‌బీకేలు, పేదలకు ఇళ్లు అన్నీ ఏర్పాటయ్యాయి. ఆ ఊరి పేరు గొప్పిలి. ఆంధ్రాకు చివరిగా, ఒడిశాకు దగ్గరగా ఉండే ఈ గ్రామంలో ఇప్పుడు ప్రగతి జాడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మెళియాపుట్టి: మండలంలోని ఓ మారుమూల విసిరేసినట్టు ఉండే గ్రామం గొప్పిలి. పేరుకు మెళియాపుట్టి మండలమే అయినా పలాస, మందస మండలాలకు దగ్గరగా ఉంటుందీ పంచాయతీ. ఒడిశాకు దగ్గరగా ఉండే ఈ గ్రామంలో దశాబ్దాలుగా ఎన్నో సమస్యలు వేధించేవి. అన్నింటినీ ఊరు మౌనంగా భరించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఊరిలో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఊరిలో మౌలిక వసతులు లేకపోవడాన్ని స్థానికులు చూశారు. కానీ వైఎస్ జగన్ సర్కారు వచ్చిన ఐదేళ్లలోనే వారు చాలా మార్పులు గమనించారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవ, ప్రభుత్వ ఉదారత కలగలిపి ఊరుకు కొత్త రూపునిచ్చాయి. గత టీడీపీ హయాంలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలోనే జరిగిందని సర్పంచ్ జయసుధ తెలిపారు.



సచివాలయ భవనం



గ్రామంలో కొత్త సీసీ రహదారులు

ప్రగతి పనుల్లో కొన్ని..

- రూ. 12 లక్షలతో గ్రామంలోని వీధులకు సీసీ రోడ్లు వేశారు.
- రూ. 50 లక్షలతో డ్రైనేజీలు నిర్మించారు.
- రూ.5లక్షలతో కుమ్మరి వీధికి తాగునీటి ట్యాంకు నిర్మించారు.
- గ్రామంలోని హరిజన వీధి వాసులకు కమ్యూనిటీ హాల్ నిర్మించారు. అదేవీధిలో రూ.3 లక్షలతో నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు.
- రూ.కోటితో ఎంపీయూపీ పాఠశాల, జిల్లాపరిషత్ పాఠశాలలు నాడు-నేడు ద్వారా సుందరంగా తీర్చిదిద్దారు.
- రూ. 50 లక్షలతో జిల్లాపరిషత్ పాఠశాలలో నాలుగు తరగతి గదుల నిర్మించారు. నూతన వంట శాల కూడా ఏర్పాటు చేశారు.
- రూ.కోటితో రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించారు.
- రూ.22 లక్షలతో గ్రామం మొత్తానికి తాగునీటిని అందించే ట్యాంకు ఏర్పాటు చేశారు.
- హైస్కూల్ మైదానం వద్ద రూ.5 లక్షలతోస్టేజీ కట్టారు.
- 65మందికి జగనన్న కాలనీలో ఇళ్ల మంజూరు చేశారు.
- రూ.3లక్షలతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు.
- ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో రైల్‌ఖానా బ్రిడ్జి నిర్మించారు.

అప్పట్లో ఇబ్బంది పడ్డాం



మా గ్రామ ప్రజలు మౌలిక సదుపాయాలు లేక ఒకప్పుడు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మా ఎమ్మెల్యే రెడ్డి శాంతమ్మ చొరవతో మా పంచాయతీని అభివృద్ధి చేసుకున్నాం. ప్రజలు సంతోషంగా ఉండాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలి.
– పల్లి జయసుధ, సర్పంచ్, గొప్పిలి

గొప్పిలిలోనే ముందు..



ప్రభుత్వ భవనాలను గొప్పిలిలోనే ముందు ప్రారంభించాం. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించారు. గొప్పిలి గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూస్తే ఎవరైనా సంతోషపడాల్సిందే. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాకు చాలా సహకారం అందించారు. – పల్లి యోగి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, గొప్పిలి



విలేజ్ హెల్త్ క్లినిక్

జాతీయ లోక్ అదాలత్ 16కి వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కి వాయిదా వేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సన్యాసి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 9న మహాశివరాత్రి ఉండడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు మాత్రమే కాకుండా మోటార్ బీమా కేసులు బ్యాంకు కేసులు, ప్రీ లిటికేషన్ స్థాయిలో ఉండే కేసులు పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు ఆమదాలవలస, కోటబొమ్మాళి, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం సోంపేట, టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, ఇచ్ఛాపురం కోర్టుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ప్రజలంతా గమనించాలని కోరారు.

బరంపురం వరకు విశాఖ-పలాస పాసింజర్

కంచిలి: విశాఖపట్నం నుంచి పలాస వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైలు 08531(58531), 08532(58532)లను బరంపురం వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హా ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే సీపీటీఎం, భువనేశ్వర్‌కు సమాచారం అందినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోంపేట స్టేషన్ మేనేజర్ శంకర్ బెహరా మంగళవారం తెలిపారు. ప్రతి రోజు ఈ రైలు ఉదయం 3.50 గంటలకు బరంపురంలో బయలుదేరి, ఇచ్ఛాపురానికి 4.09కు చేరి, అక్కడి నుంచి 4.10 గంటలకు బయల్దేరి సోంపేటకు 4.22కు చేరి, ఇక్కడ 4.23కు బయల్దేరి, మందస రోడ్డుకు 4.33కు చేరి, అక్కడి నుంచి 4.34కు బయలుదేరుతుంది. ఈ రైలు విశాఖపట్నానికి ఎప్పటిలాగే ఉదయం 9.20 గంటలకు చేరుతుంది. తిరిగి విశాఖపట్నం నుంచి సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి, మందసకు రాత్రి 10.15గంటలకు, సోంపేటకు 10.31కు, ఇచ్ఛాపురానికి 10.47కు, బరంపురానికి 11.10 గంటలకు చేరుతుంది.

జెడ్పీ చైర్‌పర్సన్ కృషి మేరకే..

విశాఖ-పలాస పాసింజర్ రైలు సర్వీసు బరంపురం వరకు పొడిగించడంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కృషి ఉంది. ఇదివరకే ఆమె రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి ఈ మేరకు విన్నవించిన అంశాన్ని మంగళవారం ఓ ప్రకటనలో గుర్తు చేశారు. రైల్వే ప్రయాణికుల సంఘం తరఫున జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయతోపాటు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాశ్ కూడా పలుసార్లు లేఖలు రాయడం, రైల్వే బోర్డు సమావేశాల్లో ఈ విషయమై ప్రస్తావించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.



రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ(ఫైల్)

‘నైపుణ్యాలకే పెద్దపీట’

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తామని బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. ఉన్నత విద్యా మండలి, సెంటర్ స్కిల్ కౌన్సిల్ వర్చువల్‌గా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. భవిష్యత్‌లో డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఏడాది పాటు నిర్వహించనున్న అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రొగ్రాం కోర్సుపై ఉన్నత విద్యా మండలి అధికారులు పలు సూచనలు చేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ స్కీమ్ ఆఫ్ పాలసీస్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం కనీసం ఐదు కళాశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈ పథకం ప్రారంభమవుతుందని, అందుకు గాను వర్సిటీ పరిధిలోని కళాశాలల జాబితా సిద్ధం చేసి అందజేయాలని సూచించారు. ప్రధానంగా విద్యార్థులకు తాము చదువుతున్న కోర్సుకు సంబంధించి అనుసంధానంగా పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు, రవాణా రంగం వంటి వాటిపై అవగాహన కల్పించి నైపుణ్యాలు నేర్పిస్తామన్నారు. నూతన విద్యా విద్యావిధానం నేపథ్యంలో విద్య బలోపేతం, విద్యార్థుల్లో నైపుణ్యాలు, విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వీసీ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

రూ.673 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్
- జిల్లాలోని పలు పాఠశాలల పరిశీలన



టెక్కలి ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న నాగార్జున యాదవ్

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు కల్పించాలనే ఆలోచన దేశంలోనే ప్రప్రథమంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేశారని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) యనమల నాగార్జున యాదవ్ అన్నారు. ఆయన నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన మార్పులను పరిశీలించేందుకు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ జిల్లా పరిషత్ పాఠశాల, టెక్కలి జిల్లా పరిషత్ పాఠశాల, నరసన్నపేట మండల పరిషత్ పాఠశాల, శ్రీకాకుళం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలోని 30 మండలాల్లో గల 2016 పాఠశాలల్లో నాడు-నేడు కింద రూ.673 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఈ ఫలాలను పేద విద్యార్థులు సంతోషంగా అందుకుంటున్నారని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు, ప్రవేశాలు పెరిగాయని చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థలకు మించి ప్రభుత్వ పాఠశాలలు ప్రగతి పథంలో ముందుకు వెళ్తున్నాయని తెలియజేశారు. రాష్ట్రంలో రూ. 17 వేల కోట్లు పైగా వెచ్చించి ప్రభుత్వ బడులను బాగు చేశారని, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించారని, ఈ అవకాశాన్ని విద్యార్థులంతా తప్పక ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ పర్యటనలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ డీవీఎస్ మూర్తి, సైట్ ఇంజనీర్లు సునీల్, రాజేంద్ర రెడ్డి, కిరణ్, సమగ్ర శిక్ష ఏఈలు గణేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను



- నేడు వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్, సున్నావడ్డీ నగదు జమ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు వెన్నుదన్ను అందిస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ నాలుగేళ్లు మాత్రమే ఇస్తామని హామీ ఇచ్చినా ఐదో ఏటా కొనసాగించారు. దీనిలో భాగంగా నేడు 5వ ఏటకు సంబంధించిన మూడో విడత నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ కింద రూ. 1919.46 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీనిలో భాగంగా 5వ ఏటా మూడో విడత 3.22లక్షల మందికి గాను రూ 3.70కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ

రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించేందుకు వారిపైన పడిన వడ్డీ భారాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ అమలుచేస్తోంది. రూ.లక్ష రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లించిన రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. పూర్తిగా రుణం, వడ్డీ సకాలంలో చెల్లించిన రైతులకు మాత్రమే సున్నావడ్డీ పథకం కింద 4శాతం వడ్డీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. 2021-2022 రబీ కాలంలో రూ.5.90కోట్లు 2022 ఖరీఫ్ కాలంలో రూ.13.24కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. మొత్తం 1.26లక్షల మందికి ఈ డబ్బులు జమ కానున్నాయి.

రైతుభరోసా లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య	లబ్ధి రూ.కోట్లలో
2019-20	2,58,147	రూ.348.49
2020-21	2,91,499	రూ.393.52
2021-22	3,07,089	రూ.414.57
2022-23	3,10,346	రూ.393.16
2023-24	3,21,854	రూ.369.72
మొత్తం	14,88,935	రూ. 1919.46

రైతులను ఆదుకోవడమే లక్ష్యం



సాగు చేస్తున్న రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. దీనిలో భాగంగానే వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నావడ్డీని డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఎలాంటి అవినీతికి తావులేకుండా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నాం. ఈ 5వ ఏటా మూడో విడత సొమ్ము వేస్తున్నాం.
– కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

వైద్యారోగ్య శాఖలో 3 పోస్టుల భర్తీ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని జాతీయ హెల్త్ మిషన్, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసేందుకు కాంట్రాక్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్ (ఓసీ), ఔట్ సోర్సింగ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఓసీ), లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (బిసి-ఇ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు అర్హులు వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమర్పించాలని, మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

‘ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం’



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసుల పాత్ర కీలకమైనదని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులతో ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌లను క్షుణ్ణంగా చదవాలని కోరారు. రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించాలని, వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తెచ్చి, వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. శిక్షణ పొందిన రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ శిక్షకులు, నోడల్ అధికారులైన ఎం.కిరణ్ కుమార్, కె.శేషగిరి రావు ఎస్.బాలాజీలు ఎన్నికల ప్రక్రియపై, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సందర్భంలో, పోలింగ్ తర్వాత చేయాల్సిన విధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డీఎస్పీ విజయ్ కుమార్, 30 మండలాల నుంచి సెక్టార్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు విస్తృత ప్రచారం

అరసవల్లి: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చి 3న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, అనుబంధ సిబ్బంది ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో పల్స్ పోలియో కరపత్రాలను ఆవిష్కరించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించి పోలియో రహిత జిల్లాగా మార్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పల్స్‌పోలియో కరపత్రాలను ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ మీనాక్షి తదితరులు

క్లుప్తంగా

పరీక్షల్లో ఉచిత బస్సు ప్రయాణం

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గల పదో తరగతి విద్యార్థులకు మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో తమ హాల్ టికెట్ కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చింతకొమ్మదిన్నె: వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె గ్రామంలో లావణ్య (20) అనే వివాహిత సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు మృతురాలు లావణ్యది శ్రీకాకుళం జిల్లా, ఇద్దివానిపాలెం. గత నెలలో చింతకొమ్మదిన్నెకు చెందిన గణేష్ రెడ్డితో వివాహమైంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉరివేసుకొని మృతి చెందింది. ఈ విషయం తమ దృష్టికి రావడంతో మృతురాలి తండ్రి హరికృష్ణకు సమాచారం ఇచ్చి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జీ(వి)తం మెరుగైంది

- అర్చకులకు వంశపారంపర్య హక్కు పునరుద్ధరణ
- పెరిగిన జీతాలతో అర్చకుల్లో హర్షాతిరేకాలు
- 121 దేవాలయాలకు ధూపదీపనైవేద్యాల పెంపు



నగరంలో కామాక్షమ్మ దేవాలయం

శ్రీకాకుళం కల్చరల్:

బతుకంతా దేవుడి సేవలో గడిపే అర్చకులకు ప్రభుత్వం తీపి కబుర్లు అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపారు. రెండునెలల కిందట దేవాలయ అర్చకు ల జీవితాలను చక్కదిద్దాలని దేవాలయాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం అర్చకుల జీతాలను ఒక్కసారిగా నెలకు రూ.15,625లకు పెంచుతూ నిర్ణయించారు. దేవాలయ నిధిలో తగినంత ఆదాయం లేకపోతే దాన్ని అర్చక వెల్ఫేర్ రెమ్యూనరేషన్ ఫండ్ నుంచి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అర్చక వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 1987లో చల్ల కొండయ్య కమిషన్ ఆదేశాలతో ఒక చట్టాన్ని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అమ లు చేస్తూ అర్చకుల వంశపారంపర్య హక్కును ఎత్తేసింది. దీంతో అర్చకుల జీవితాలు రోడ్డున పడ్డా యి. నాటి నుంచి పోరాటం చేస్తున్న అర్చకులకు కొంత ఊరటగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో అర్చకులకు జీతాలను పట్టణ పరిధిలో రూ.6వేలు, గ్రామీణ పరిధిలో రూ.5వేలుగా నిర్ణ యించారు. ఆదాయం లేని ఆలయాలకు ఆసరాగా ధూపదీప నైవేద్యాల కోసం పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే వైఎస్సార్ తర్వాత వారి బాగోగులు పట్టించుకునే ప్రభుత్వాలే కరువయ్యాయి.

ఆదాయం బట్టి గ్రేడ్

జిల్లాలో 749 నోటిఫైడ్ దేవాలయాలు ఉండగా వాటిలో ఆదాయాన్ని బట్టి 6ఎ దేవాలయాలు 5, 6బి దేవాలయాలు 19, 6సి దేవాలయాలు 713, 6డిలో 12 మఠాలు ఉన్నాయి. వీటికి ఆదాయ వనరులుగా పంటభూములు, స్థలాలు ఉన్నాయి. ఈ దేవాలయాల్లో ఉన్న సుమారు 98 మంది అర్చకులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లబ్ధి కల్పించింది. మిగిలిన దేవాలయాలు స్థానిక గ్రామ కమిటీల నిర్వహణలో ఉన్నాయి.

కొత్త జీఓతో ఆనందం..

ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న అర్చకులకు వంశపారంపర్య హక్కును తిరిగి పునరుద్ధరణ చేస్తూ ఇచ్చిన జీఓతో అర్చకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 43/10 రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి అర్చకుల కుటుంబ సభ్యుల్లో 17 ఏళ్లు నిండిన వారి పేర్లు నమోదు చెయ్యాలని ఆదేశించారు. దీని ప్రకారం వంశపారంపర్య హక్కు వారికి దక్కినట్టైంది. 59మంది అర్చకులకు వంశపారంపర్య హక్కును కల్పిస్తూ దేవాదాయశాఖ రికార్డుల్లో నమోదు చేశారు. అర్చకులకు ఇప్పటి వరకు ఇస్తున్న రూ.10వేలుని ఒక్కసారిగా రూ.15,625కు పెంచారు. దీంతో 6ఎ, 6బి దేవాలయాల్లోని అర్చకుల జీతాలను దేవాలయ ఆదా యం నుంచి చెల్లించాలని, ఆదాయం తక్కువగా ఉన్న 6సి దేవాలయాల అర్చకులకు అర్చక వెల్ఫేర్ రెమ్యూనరేషన్ ఫండ్ నుంచి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న దేవాలయ అర్చకులకు రూ.10,625లు పెరిగాయి. ఈ జీతాల పెంపు వల్ల 59 మంది అర్చకులు ప్రస్తుతం వస్తున్న జీతానికి అదనంగా రూ.5వేలు లబ్ధి పొందారు.

121 దేవాలయాలకు ధూప దీప నైవేద్యాలు

జిల్లాలోని మిగిలిన దేవాలయాల్లో 121 దేవాలయాలను గుర్తించి వారికి నెలకు ఇస్తున్న రూ.2500ల నుంచి ఏకంగా రూ.5వేలు ఇచ్చేలా జీఓ ఇచ్చారు. ఇందులో అర్చకుని జీతం కింద రూ.2500లు కాగా దీపానికి రూ.వెయ్యి, రూ.15వందలు పూజా సామగ్రి కొనుగోలుకు వెచ్చించాల్సి ఉంది. ఈఓల పర్యవేక్షణలో ఉన్న అన్ని దేవాలయాలకు ఈ పథకం వర్తింపజేశారు. అలాగే జిల్లాలో రూ.5లక్షల లోపు ఆదాయం గల 713 దేవాలయాలను అర్చకులకు, అలాగే గ్రామ కమిటీలకు అప్పగించారు.

కొత్త ఉత్సాహం వచ్చింది



ప్రభుత్వం ఇచ్చిన జీఓతో మాలో కొత్త ఉత్సాహం వచ్చింది. జీతాల పెంపు విషయంలో కానీ, వంశ పారంపర్య హక్కు ఇవ్వడం లోకాని ఎంతో లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.

– ఆరవెల్లి శ్రీరామమూర్తి, ఏపీ అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు

121 ఆలయాలకు ధూపదీప నైవేద్యాలు



ధూప దీప నైవేద్యాల కోసం ప్రభుత్వం ఇస్తున్న సొమ్మును పెంపు చేయడం చాలా ఆనందం. గతంలో 95 దేవాలయాలకు మాత్రమే ఇచ్చేవారు. ఈ ప్రభుత్వ హయాంలో దాన్ని 121 దేవాలయాలకు పెంచారు. ఈ సంఖ్య ఇంకా పెంచాలని కోరుతున్నాం.

– పెంట శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అర్చక సంఘం, అధ్యక్షుడు

ఆదేశాలు అమలు చేస్తున్నాం



అర్చకుల వెల్ఫేర్ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులు సమర్థంగా అమలు చేస్తున్నాం. 98 అర్చకులకు వంశపారంపర్య హక్కు కల్పించాం. 59 మంది అర్చకులకు జీతాలు పెరిగాయి. ప్రస్తుతం 713 దేవాలయాలు పలువురు అర్చకులు, గ్రామ కమిటీల ద్వారా నిర్వహణలో ఉన్నాయి.

– టీఆర్‌వీవీ ప్రసాద్‌పట్నాయిక్, జిల్లా దేవాదాయశాఖ అధికారి

'సాంకేతికతకు పదును పెడదాం'



గోకార్ట్ చాంపియన్ షిప్‌ను ప్రారంభిస్తున్న ఏపీ ఇన్నోవేషన్ సీఈఓ అనిల్ టెంటు, తదితరులు

టెక్కలి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతకు సాంకేతికతను జోడించి సరికొత్త ఆలోచనలకు పదును పెట్టాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈఓ అనిల్ టెంటు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ స్థాయిలో గోకార్ట్ చాంపియన్ షిప్, యాక్‌తాన్-2024 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టార్టప్‌లకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను నిరూపించుకోవాలని సీఈఓ కోరారు. రాష్ట్ర ఇన్నోవేషన్ సొసైటీ, 40 యూనివర్సిటీలతో కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థులంతా 5జీ, ఎమర్జింగ్ టెక్నాలజీపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయి గోకార్ట్ పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక నుంచి సుమారు 15 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. యాక్‌తాన్ పోటీలకు ఏపీ, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, ఒడిశా, ఆగ్రా, చండీఘర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి 35 బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ వి.సుధాప్రియ, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, వి.నాగసంకేత్, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కార్యక్రమం కన్వీనర్లు డి.శ్రీరాములు, డి.ఆజాద్, జి.సతీష్‌కుమార్, డీన్‌లు డి.విష్ణుమూర్తి, డి.విజయ్ కుమార్, బి.వి.రమణ, ఎం.జయమన్మథరావు, డి.యుగంధర్, బి.రామారావు, యు.డి.ప్రసన్న, వై.రమేష్, పి.దినకర్, కె.కిరణ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు.

– సారవకోట

600 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం



సారా తయారీకి ఉపయోగించే సామగ్రితో సెబ్ ఎస్ఐ శ్రావణి, సిబ్బంది

కొత్తూరు: కొత్తూరు మండలంలోని చింతమానుగూడ గిరిజన పరిసర ప్రాంతాల్లో స్థానిక సెబ్ ఎస్ఐ శ్రావణి తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 600 లీటర్లు బెల్లపు ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ చెప్పారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారు చేస్తున్న వారు పరారయ్యారు.

'ఇళ్ల స్థలాల ప్రతిపాదనలు పంపాలి'



జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలు తక్షణమే పంపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆర్డీఓలను ఆదేశించారు. జర్నలిస్టుల హౌసింగ్ పథకానికి సంబంధించి రెండో సారి జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా సమీక్షించారు. పలాసలో సైట్లు గుర్తించామని, దరఖాస్తులు పరిశీలించామని ఆర్డీఓ భరత్ నాయక్ చెప్పగా తక్షణమే సంబంధిత ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ టెక్కలిలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని చెప్పారు. గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేదా ప్రైవేట్ భూమి చూడాలని జేసీ వివరించారు. శ్రీకాకుళం డివిజన్‌లో ఆమదాలవలస, తిమ్మాపురం, బూర్జ, సరుబుజ్జిలి, లావేరు మండలాల్లో ఇప్పటికే సైట్ చూశామని శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య జేసీకి వివరించారు. తక్షణమే పరిశీలించి జాబితా సిద్ధం చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. జేసీ మాట్లడుతూ మొదటిసారి నిర్వహించిన సమావేశం నాటికి 326 దరఖాస్తులు రాగా రెండో సారి నిర్వహించిన సమావేశం నాటికి మరో 23 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చినట్లు వివరించారు. సభ్యులు శాసపు జోగినాయుడు, వి.సన్యాసినాయుడు మాట్లాడుతూ గతంలో ఒక సెంటు ఇళ్ల పట్టాలను పొందిన వారు సుమారు 60 మంది వరకు ఉంటారని, వారికి మినహాయింపు లేదా ఆ పట్టాలు తిరిగి ఇచ్చేస్తారని జేసీకి వివరించారు. తిరిగి 2వ తేదీన సమావేశం ఏర్పాటు చేయాలని డిఐపిఆర్ఓ చెన్నకేశవరావును జేసీ ఆదేశించారు.

వివాహిత హత్య

- హతురాలు, నిందితుడు ఇద్దరూ ఒడిశా వాసులే
- సారవకోట మండలం నౌతళ సమీపంలో హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి (ఇన్‌సెట్లో) మృతురాలు ఆరుద్ర (ఫైల్)

సారవకోట,పాతపట్నం: మండలంలోని నౌతళ సమీపంలో శుక్రవారం జరిగిన హత్యోదంతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి మండల రంగాపురం గ్రామానికి చెందిన శాసనాం ఆరుద్ర అనే మహిళకు 19 ఏళ్ల కిందట ఒడిషా రాష్ట్రం రాయఘడ బ్లాక్, పాటికోటకు చెందిన సోమేశ్వరరావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె భర్త పాటికోటలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. ఆరుద్రకు ఆ గ్రామానికి సమీపంలో ఉన్న కాంట్రగడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఊడు పాపారావుతో పరిచయం ఏర్పడింది. ఈ నెల 23న ఆరుద్ర తన కన్న వారి గ్రామమైన రంగాపురానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం ఆమె తిరిగి అత్తవారింటికి బయల్దేరారు. ఆమె సోదరుడు పైల లోకేశ్వరరావు ఆమెను తెంబూరులో బస్సు ఎక్కించారు. అయితే ఆమె పాటికోట చేరలేదు. ఈ విషయం తెలుసుకున్న సోదరుడు అదే రోజు రాత్రి పాతపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆరుద్ర ఫోన్ కాల్స్ ఆధారంగా కాంట్రగడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఊడు పాపారావును విచారించారు. విచారణలో విస్తుబోయే వాస్తవాలు తెలిశాయి. ఆరుద్ర తాను చంపేశానని ఆటో డ్రైవర్ చెప్పడంతో పోలీసులు ఆ స్థలాన్ని చూపించాలని సూచించారు. దీంతో అతడు సారవకోట మండలం నౌతళ గ్రామానికి సమీపంలో ఉన్న తోటలోకి తీసుకెళ్లి చూపించగా.. అక్కడ ఆరుద్ర మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో కనిపించింది. తామిద్దరం ఆటోలో ఇక్కడకు వచ్చామని, తొలుత ఇద్దరం సన్నిహితంగా మెలిగామని, ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవ జరగడంతో హత్య చేశానని అతను ఒప్పుకున్నాడు. చంపేశాక ఆమె మెడలో ఉన్న బంగారాన్ని తీసుకుని వెళ్లినట్లు చెప్పాడు. హత్య జరిగి ఐదు రోజులు కావడంతో మృతదేహం పాడైపోయింది. సంఘటన స్థలాన్ని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, సారవకోట, పాతపట్నం సీఐలు జి.అప్పారావు, మహమ్మద్ యాసిన్‌లు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్ఎన్ పేట: మండలంలోని అలికాం-బత్తిలి రోడ్డుపై శ్యామలాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కొత్తూరు వీఆర్‌ఓగా పనిచేస్తున్న రాము, వీఆర్ఏ అనిల్‌లు పేదల ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను తీసుకుని శ్రీకాకుళం నుంచి ద్విచక్ర వాహనంపై కొత్తూరు వస్తున్నారు. శ్యామలాపురం వద్ద వీరి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పశువులు రావటంతో ప్రమాదానికి గురయ్యారని స్థానికులు తెలిపారు. పశువులు రోడ్డుకు అడ్డంగా వచ్చిన సమయంలో వీరు ద్విచక్ర వాహనంపై నెమ్మదిగా రావటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన వీరిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్సకు తరలించినట్లు తెలిపారు.

ఘనంగా పలాసలో గావు సంబరం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో గంగాదేవి గావు సంబరం మంగళవారం ఘనంగా జరిగింది. తప్పెటగుళ్లు కళాకారులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గొల్లచదువు వినేందుకు, తప్పెటగుళ్ల చూసేందుకు పెద్ద ఎత్తున జనం వచ్చారు.



ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన